వెలుగు జిలుగులు

విద్యుత్ కాంతులీనుతున్న 'పశ్చిమ' | 98 శాతం వెలుగుతున్న వీధిలైట్లు | వెలగని చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు



బుచ్చిరాజుపాలెం బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయం వద్ద విద్యుత్ వెలుగుల్లో హైమాస్ట్ లైట్లు



కొత్తపాలెంలో వెలుగుతున్న విద్యుత్ లైట్

గోపాలపట్నం/సింథియా/మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గం విద్యుద్దీప కాంతులతో వెలిగిపోతోంది. జీవీఎంసీ 40, 58, 59, 60, 61, 62, 63 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో సుమారు 200 వీధి లైట్లు కొత్తవి అమర్చారు. విద్యుత్ సిబ్బంది లైట్లన్నింటినీ పూర్తిస్థాయిలో వెలిగించేలా జీవీఎంసీ చేపట్టిన ప్రత్యేక కార్యచరణ సత్ఫలితాలిస్తోంది. దాదాపు 98 శాతం వీధిలైట్లు వెలగడంతో పారిశ్రామిక ప్రాంతం విద్యుత్ కాంతులతో రహదారులు సుందరంగా కనిపిస్తున్నాయి.

ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో వీధిలైట్ల సమస్యలను సభ్యులు లేవనెత్తడంతో విద్యుత్ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. గత వారం జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగం ఇంజినీర్లు, విద్యుత్ అధికారులు సంయుక్తంగా పారిశ్రామిక ప్రాంతంలోని విద్యుత్ దీపాలపై సర్వే నిర్వహించారు. దీనిలో 63 వీధిలైట్లు వెలగడం లేదని గుర్తించడంతో 3 రోజుల్లో అవి వెలిగేలా చర్యలు చేపట్టారు.



ఇది కదా అభివృద్ధి

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు.. మరమ్మతులు

- బుచ్చిరాజుపాలెం బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయం వద్ద నూతనంగా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు.
- గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద 8 విద్యుత్ దీపాలతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు.



భగత్‌సింగ్‌నగర్‌లో మరమ్మతుల అనంతరం వెలుగుతున్న విద్యుత్ లైట్

- 89వ వార్డు భగత్‌సింగ్‌నగర్, చంద్రనగర్ ప్రాంతాల్లో విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపట్టారు. పాడైనవి తొలగించి కొత్త లైట్లు ఏర్పాటు చేశారు.
- 92వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో రెండు చోట్ల విద్యుత్ లైట్లకు మరమ్మతులు చేపట్టారు.

పూర్తి స్థాయిలో వెలిగేలా చర్యలు

పారిశ్రామిక ప్రాంతంలో వీధిలైట్లు పూర్తిస్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ విభాగం అధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వెలగని లైట్లను ఎప్పటికప్పుడూ గుర్తించి సోమ, మంగళ, బుధవారాల్లో కొత్తలైట్ల ఏర్పాటు, విద్యుత్ లైన్లలో లోపాలను సవరించడం, స్ట్రీట్‌లైట్ల మానటరింగ్ చేసే బాక్స్‌లను పునరుద్ధరించడం, ప్రతి రోజు తనిఖీలు చేయడంతో పూర్తిస్థాయిలో వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటున్నారు. కేవలం అధికారులు అందించిన లెక్కలపైనే ఆధారపడి ఉండకుండా నిత్యం తనిఖీలు చేసేలా సచివాలయ సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు.

హైమాస్ట్ లైట్లతో చీకట్లు పోయాయి



బుచ్చిరాజుపాలెం బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లతో చీకట్లు తొలగిపోయాయి. ఇక్కడ విద్యుత్ వెలుగు విరజిమ్ముతున్నాయి. అధికారులు చేపట్టిన చర్యలు బాగున్నాయి.

– చిటికల రాము, బుచ్చిరాజుపాలెం

రాత్రి వేళలో ఇబ్బందులు తొలగాయి



విద్యుత్ దీపాలు లేక మా ప్రాంతంలో రాత్రి సమయంలో ఇబ్బందులు పడేవాళ్లం. అధికారుల చర్యలతో ఆ బాధలు తప్పాయి. నాలుగు లైట్లతో మంచి వెలుగు వస్తోంది. ఎన్నాళ్ల నుంచో కోరుతున్నాం. ఇన్నాళ్లకు మా కోరిక నెరవేరింది

– లక్ష్మీనాయుడు, బుచ్చిరాజుపాలెం

లైట్లు వెలుగుతున్నాయి



గతంలో మా ప్రాంతంలో వీధిలైట్లు సరిగ్గా వెలగక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. రాత్రిళ్లు బయటకు రాలేక భయపడేవారం. ప్రస్తుతం విద్యుత్ అధికారులు వీధి లైట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో లైట్లు వెలుగుతున్నాయి. వీధిలైట్ల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చూపాలని కోరుతున్నాం.

– అప్పలరాజు, ప్రకాష్ నగర్

సాఫీగా ప్రయాణిస్తున్నాం



గతంలో పారిశ్రామిక ప్రాంత వీధుల్లో ప్రయాణించాలంటే భయమేసేది. వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రయాణాలను రద్దు చేసేకునే వాడిని. ప్రస్తుతం వీధిలైట్లను సరి చేయడంతో పాటు అడుగడునా కొత్తగా లైట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీధులన్నీ కాంతులతో కనిపిస్తున్నాయి. ప్రభుత్వం మౌలిక వసతులు బాగా కల్పిస్తోంది.

– చింతా ప్రభాకర్, ఏకేసీ కాలనీ,40వ వార్డు

క్లుప్తంగా

సామాజిక భవనం ఏర్పాటు చేయాలని వినతి



ఆనంద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: తమ సామాజికవర్గానికి పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కడైనా సామాజికభవనం నిర్మించాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను కోరారు. 59వ వార్డులో శుక్రవారం ఆనంద్ కుమార్‌ను సంఘ ప్రతినిధులు సూర్యప్రకాష్ రావు,రాజు తదితరలు కలిసి వినతి పత్రం అందజేశారు. ఏడు వార్డుల్లో తమ సామాజిక వర్గం సుమారు రెండు వేల మంది ఉన్నారని వివరించారు. తమ ఇళ్లలో ఏ శుభకార్యాలు చేసుకోవాలన్నా ఇబ్బంది పడుతున్నామని సామాజిక భవనం నిర్మిస్తే తమ సమావేశాలు,శుభకార్యాలు నిర్వహించుకుంటామన్నారు.దీనిపై ఆనంద్‌కుమార్ సానుకూలంగా స్పందించారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలో కమ్యూనిటీ హాలు, సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్ కృషితో ఈ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనులకు జీవీఎంసీ నిధులు రూ.45 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. నాయకులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, కంపర సత్తిబాబు, కంచిపాటి జగదీష్, జె.శంకర్, షేక్ వల్లి, రాజులమ్మ పాల్గొన్నారు.

ఆధునిక వైద్యంతో ఎయిడ్స్‌పై విజయం



వైద్య శిబిరంలో మందులు అందిస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

కంచరపాలెం: ఆధునిక వైద్యంతో ఎయిడ్స్ వ్యాధిపై విజయం సాధించవచ్చని పద్మశ్రీ అవార్డు పురస్కార గ్రహీత, వైద్య నిపుణుడు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులోని కూటికుప్పల సూర్యారావు హాస్పిటల్‌లో మల్టీ స్పెషాలిటీస్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలో సుమారు 565 మందికి వివిధ రకాల వైద్య, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ డి సుభాదేవి, డాక్టర్ అచ్యుతరావు, డాక్టర్ కె.అశ్విని, డాక్టర్ సురేష్, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ మధుకర్, డాక్టర్ హెచ్.హుస్సేన్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), శాంతి(టెక్నికల్) తెలిపారు. 8 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 345 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 101 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 42 మంది ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెప్పారు.

60 అడుగుల రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి



రహదారి విస్తరణ ప్రాంతంలో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

విశాఖ విద్య: జాతీయ రహదారి పాస్‌పోర్టు కార్యాలయం పక్క నుంచి నేతాజీకాలనీ మీదుగా శాంతినగర్ చర్చి వరకు 60 అడుగుల రోడ్డుగా విస్తరించే విషయంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హామీ ఇచ్చారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌లతో కలసి ఆయన శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రస్తుతం 30 అడుగుల రోడ్డుగా ఉన్న దీన్ని 60 అడుగులు విస్తరించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని వారు సుబ్బారెడ్డికి తెలిపారు. రహదారి విస్తరణతో ఈ ప్రాంత వాసులకు కలిగే మేలును ఇటీవల విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. ఎయిర్‌పోర్టు అథారిటీ వారు రహదారి విస్తరణకు అవసరమయ్యే స్థలం ఇవ్వాల్సి ఉందన్నారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరంగా ఉండే ఈ రహదారి విస్తరణకు తన వంతు కృషి చేస్తానన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, బీఎస్ కృష్ణ, జియ్యాని మారుతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో ఏవియేషన్ అవేర్‌నెస్ వీక్



విమానాశ్రయంలో సీఆర్‌పీ విధానాన్ని వివరిస్తున్న వైద్య సిబ్బంది

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో ఏవియేషన్ అవేర్‌నెస్ వారోత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా శుక్రవారం అత్యవసర వైద్య సాయం ఏవిధంగా అందించాలో అపోలో ఆస్పత్రి వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తి ప్రాణాలను కాపాడే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రమాదకర స్థితిలో ఉన్న వ్యక్తికి సీఆర్‌పీ ఏవిధంగా చేయాలో ఎయిర్‌పోర్టు అధికారులు, సిబ్బందికి నేర్పించారు. అలాగే అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఆ మంటలు ఆర్పే విధానాన్ని ఫైర్ సేఫ్టీ అధికారులు వివరించారు. ఫైర్ ఎగ్జిస్టర్లను వాడే విధానంపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు.

గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు



గౌరీపరమేశ్వరుల మండపంపై ఆనంద్‌కుమార్, డిప్యూటీ మేయర్ శ్రీధర్



పారాయణ చేస్తున్న భక్తులు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్ గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ గౌరీపరమేశ్వరుల ఉత్సవాల్లో శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ పాల్గొన్నారు. ప్రత్యేక వేదికపై కొలువుదీరిన శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను దర్శించుకొని పూజలు చేశారు. అర్చకులు ఆశీర్వచనం అందజేసి, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా సత్యకుమారి బృందంచే సుందరకాండ పారాయణ జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

జగనన్న పాలనలో పేదలందరికీ లబ్ధి



91వ వార్డు కార్యక్రమంలోమాట్లాడుతున్న బెహరా భాస్కరరావు



61వ వార్డు కార్యక్రమంలో మాట్లాడుతున్న కలిదిండి బద్రీనాథ్

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో పేదలందరికీ లబ్ధి చేకూరిందని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. 91వ వార్డు 471 సచివాలయం పరిధి బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండాను, సచివాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన పథకాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలన్నీ పారదర్శకంగా, సక్రమంగా ప్రజలకు అందుతున్నాయన్నారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రజల బ్యాంకు ఖాతాల్లోకి చేరుతోందని చెప్పారు. అందుకే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సచివాలయం పరిధిలో ప్రభుత్వ పథకాల ద్వారా రూ.6.66 కోట్లు వెచ్చించారన్నారు. రహదారులు, కాలువల అభివృద్ధికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.20 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పారు. కోట్లాది రూపాయల నిధులతో వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, కడితి రాజు, డానియల్, భాస్కరరావు, తమ్మి రెడ్డి, పైడిరాజురెడ్డి, దేరెడ్ల సత్యనారాయణ, వూటపల్లి గోవింద్, ఉష, సుమతి, సీవో ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

61, 58 వార్డుల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జనతా కాలనీ సచివాలయం పరిధిలో శుక్రవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. పశ్చిమ క్లస్టర్–1 అధ్యక్షుడు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, వార్డు అధ్యక్షుడు జీవీఎస్ఎన్ రాజు(కేబుల్ వాసు), భోగవల్లి నాగభూషణం పాల్గొన్నారు.

అందరికీ పథకాల లబ్ధి

జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం, రామ్‌నగర్ సచివాలయాల పరిధిలో పశ్చిమ క్లస్టర్–2 అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు తదితరులు ఆ ప్రాంత లబ్ధిదారులు అందుకున్న సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేశారు.

ఠంఛన్‌గా పింఛన్ల పంపిణీ



90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో పింఛన్ నగదుఅందజేస్తున్న వలంటీర్



90వ వార్డు గవరవీధిలో పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులు



కంచరపాలెంలో పింఛన్ అందిస్తున్న వలంటీర్, సచివాలయ కన్వీనర్



కేజీహెచ్‌లో దయాలసిస్ రోగికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ సాయికిరణ్

విశాఖ విద్య: జీవీఎంసీ 52,90వ వార్డుల్లో శుక్రవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఉదయాన్నే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఠంఛన్‌గా ఇంటికొచ్చి పింఛను అందజేయడంపై లబ్ధిదారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. జాబితాలో పేర్లు ఉన్న లబ్ధిదారులందరికీ తొలిరోజునే పింఛన్ అందజేసేలా శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సచివాలయ సిబ్బందికి సూచించారు. దీంతో దాదాపు 90శాతం మందికి పింఛన్లు అందజేశారు. కొంతమంది ఇళ్ల వద్ద లేకపోవడంతో వారికి శని, ఆదివారాల్లో పింఛన్ డబ్బులు అందించేలా ఏర్పాట్లు చేశారు.

80 శాతం పంపిణీ పూర్తి

కంచరపాలెం: నియోజకవర్గంలో శుక్రవారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా జరిగింది. జీవీఎంసీ జోన్–5 పరిధిలోని ఉత్తర, పశ్చిమ నియోజవర్గాలకు సంబంధించిన 24 వార్డుల్లో టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల నేతృత్వంలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. మొత్తం 27,461 మంది పింఛన్‌దారులకు గాను తొలిరోజు 20,216 మందికి అందించారు. సుమారు రూ.7,77,55,000 నగదు పెన్షనర్లకు విడుదలైంది. సుమారు 80 శాతం పింఛన్ పంపిణీ పూర్తిచేసినట్లు యూసీడీ ఏపీడీ పద్మావతి తెలిపారు. ఇళ్లకే కాకుండా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛను నగదు అందజేశారు. శనివారానికి 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ కృష్ణ తెలిపారు. జోన్–5 ఏపీడీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆయన ఆదేశించారు.

గోపాలపట్నంలో డెంగ్యూ కేసు నమోదు

- పరిశీలించిన జెడ్సీ మల్లయ్య నాయుడు



మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్య నాయుడు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు నరసింహ నగర్‌లో డెంగ్యూ కేసు నమోదయింది. స్థానికంగా ఉంటున్న విద్యార్థికి డెంగ్యూ సోకింది. దీంతో అప్రమత్తమైన జీవీఎంసీ. అధికారులు శుక్రవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. జోన్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఏఎంహెచ్‌వో కృష్ణం రాజు, బయాలజిస్టు సాంబమూర్తి, ఎస్ఎస్ రమణ తదితరులు డెంగ్యూ కేసు నమోదైన ఇంటితో పాటు నరసింహనగర్ ప్రాంతంలో నీటి నిల్వలను పరిశీలించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ నీటిలో దోమలు పెరుగుతాయని వివరించారు. వీటి వల్ల డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు ప్రభలుతాయని తెలిపారు. ఈ ప్రాంతంలో కరపత్రాలు పంచిపెట్టారు. మలేరియా విభాగం అధికారులు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోల్లో 'గోల'ఉండదిక..



ఆటోల్లో తొలగించిన సౌండ్ బాక్సులతో ఎస్ఐ వాసుదేవరావు, సిబ్బంది

విశాఖ విద్య: ఆటోల్లో ప్రయాణికులు ఇక సాఫీగా ప్రయాణించవచ్చు. చెవులు చిల్లు పడేలా ఏర్పాటు చేసిన డిజే బాక్సుల గోల లేకుండా ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. ఎస్ఐ జి.వాసుదేవరావు సిబ్బందితో శుక్రవారం ఎన్ఏడీ ఫ్లై ఓవర్ కింద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎన్ఏడీ రోడ్‌లో వచ్చిపోయే ఆటోలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోల్లో అమర్చిన సౌండ్ బాక్సులను తొలగించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించేలా సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయవద్దని గతంలో పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఆటోవాలాల్లో మార్పు రాకపోవడంతో చర్యలకు సిద్ధమయ్యారు. ఆటోల కారణంగా ఎన్ఏడీ సెంటర్ సమీప రహదారుల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేలా ఇక నుంచి నిత్యం తనిఖీలు కొనసాగుతాయని ఎస్ఐ వాసుదేవరావు తెలిపారు.అందరి క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని చేస్తున్న కార్యక్రమాలకు సహకారం అవసరమన్నారు.